సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం : 9 : జూలై : 2024



మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. దక్షిణ భారత దేశంలో అన్ని మతాల వారు కలిసి జరుపుకొనే పండగల్లో మొహర్రం పండుగ ఒకటిగా ప్రజలు భావిస్తారు. - 8లో



అనుమతులు లేని ఎరువులు అమ్మితే చర్యలు

జిల్లాలో ఎవరైనా అనుమతులు లేని ఎరువులు అమ్మితే చర్యలు ఉంటాయని కడప విజిలెన్స్ సీఐ ఈదురుబాషా హెచ్చరించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
35.5 /25.2

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.2 - 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 9.45 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని సీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా జెడ్పీటీసీ సభ్యులతోపాటు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ శివశంకర్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

కడప ఇన్‌చార్జి ఆర్డీఓగా వెంకటపతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రెవెన్యూ డివిజనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా వి.వెంకటపతిని నియమించారు. ఈయన సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు ఆయన నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇన్‌చార్జి ఆర్డీఓగా నియమితులయ్యారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఆర్డీఓగా పనిచేస్తున్న మధుసూదన్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి ఆర్డీఓను కలెక్టర్ నియమించారు.

పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి బదిలీ

- ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశం
- ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా శామ్యూల్



ఎఫ్ఏసీ ఆర్‌జేడీ కాగిత శామ్యూల్

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య ఆర్‌జేడీగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డిని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా అదేశాలను జారీ చేసింది. గత కొన్ని రోజులుగా అయనపై పలు రకాల ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈనెల 8, 9 తేదీల్లో విచారణ జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో విచారణ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఆయనపై క్రమశిక్షణా చర్యలు పెండింగ్‌లో ఉన్నందున తక్షణమే బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పాఠశాల విద్య ఆర్‌జేడీగా కర్నూలు విద్యాశాఖ అధికారి కాగిత శామ్యూల్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈయన రెండు మూడు రోజుల్లో ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టనున్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై 10, 11 తేదీల్లో శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై ఈనెల 10, 11 తేదీలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి గల వారు ఈ తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు 9848809236 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా బి.మఠంలో అత్యధికంగా 14.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే కడపలో 9.2 మి.మీ, పెండ్లిమర్రిలో 5.6 మి.మీ, ఖాజీపేట, బి.కోడూరులలో 4.2, తొండూరులో 3.8, ఒంటిమిట్టలో 3.6 , సీకేదిన్నెలో 2.6, రాజుపాలెం, చాపాడు, బద్వేలులో 2.4 మిల్లీ మీటర్లు, మైదుకూరు, సిద్దవటంలలో 2 మి.మీ, ప్రొద్దుటూరులో 1.4, కొండాపురంలో 0.4 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది.

ట్రాన్స్‌కో ఎస్ఈగా శ్రీనివాసరావు



ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీరుగా కుంభా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం శంకరాపురంలోని ట్రాన్స్‌కో నిలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 జిల్లాలలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అంతరాయాలు లేకుండా లైన్లు, సబ్‌స్టేషన్లు నిర్వహించాలన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు ఆయనను సన్మానించి స్వాగతం పలికారు. ఎస్ఈ క్రిష్ణకుమార్, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, ఈఈలు శ్రీరామచంద్రమూర్తి, రమణమూర్తి, సుబ్రమణ్యం, నగేష్, డీఈలు రాంమోహన్, రామాంజనేయులు, విద్యావతి, ఈశ్వర్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

కార్యకర్తల్లో ధైర్యం నింపి..

ప్రజలకు భరోసా ఇచ్చి..

- ముగిసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన
- మూడు రోజుల పాటు ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో మమేకం
- మళ్లీ మంచి రోజులు వస్తాయని ఆత్మవిశ్వాసం నింపిన వైఎస్ జగన్
- దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళి అనంతరం తాడేపల్లికి పయనం



వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు



వైఎస్ జగన్‌కు నాగలి బహూకరిస్తున్న కడప మేయర్ సురేష్‌బాబు, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

సాక్షిప్రతినిధి కడప : వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటన సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈనెల 6వ తేదీన జిల్లాలో అడుగిడిన వైఎస్ జగన్ కడప, పులివెందుల ప్రాంతాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలిరోజు టీడీపీ నాయకుల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వేంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం పులివెందులకు చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో ప్రజలు భారీగా తరలివచ్చి తమ సమస్యలను అభిమాన నేతకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి వినతిని ఓపిగ్గా పరిశీలించి సంబంధిత సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అలాగే పలు జిల్లాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించి వారికి దిశా నిర్దేశం చేశారు. మూడు రోజుల పర్యటనలోనూ మాజీ సీఎం పట్ల ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలు గ్రామాల్లో వైఎస్ జగన్‌ను చూడాలని, ఆయనతో తమ మనసులోని బాధను పంచుకోవాలని గంటల తరబడి వేచి చూశారు. వైఎస్ జగన్‌ను చూడగానే పలువురు భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆయన ఓదారుస్తూ కష్టాలు తాత్కాలికమేనని.. మళ్లీ మంచి రోజులు వస్తాయని అంతవరకూ అందరూ ధైర్యంగా ఉండాలని చెప్పారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని నాయకులకు సూచించారు. చివరి రోజు సోమవారం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన ఇడుపులపాయ నుంచి కడప విమానాశ్రయానికి చేరుకుని తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు.

వైఎస్ జగన్‌కు ఆత్మీయ వీడ్కోలు

కడప కార్పొరేషన్ : మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకొని తాడేపల్లి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కడప విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు లభించింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప మేయర్ కె. సురేష్ బాబు, ఉద్యాన శాఖ మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.



వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



పార్టీ నాయకులతో సరదాగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో అభిమానుల అభివాదం

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలి

- కలెక్టర్ శివశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల రక్షణ కోసం తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలు, కార్మిక, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపకశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో రక్షణ, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొటోకాల్ కచ్చితంగా పాటించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్ట్రాటెక్ సిమెంటు ఫ్యాక్టరీలో తాజాగా జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో జిల్లాలో అన్ని పరిశ్రమల్లో భద్రత పటిష్టం చేయాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తరచూ మాక్‌డ్రిల్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కార్మికులు, ప్రజల్లో ప్రమాదాల నివారణ, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. తొలుత రెడ్ కేటగిరి పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, పరిశ్రమల శాఖ జెడ్ఎం శ్రీనివాసమూర్తి, జీఎం జయలక్ష్మి, జిల్లా ఫైర్ ఆఫీసర్ ధర్మారావు, ఇండియా సిమెంట్స్, భారతి సిమెంట్స్, దాల్మియా, జువారి సిమెంటు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజన్న సేవలు చిరస్మరణీయం



కమలాపురం : వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



జమ్మలమడుగు : వైఎస్సార్ జయంతి వేడుకలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రొద్దుటూరు : వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి



పోరుమామిళ్ల : వైఎస్సార్ చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తదితరుల నివాళి



పులివెందుల : వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు



మైదుకూరు : వైఎస్సార్ జయంతి కేక్‌ను కట్ చేస్తున్న ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి



కడపలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 75వ జయంతి వేడుకలు సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిరెడ్డి, వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

- కడపలోని హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, యానాదయ్య, పులిసునీల్, కరిముల్లా, పాకా సురేష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు.
- పులివెందులలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప పట్టణంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- జమ్మలమడుగు పట్టణం టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పాలనా సంస్కరణల చేత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత వైఎస్సార్ అన్నారు.
- కమలాపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకుల దాడిలో ఇల్లు కోల్పోయిన కె. శ్రీనివాసరెడ్డికి కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన రూ.50వేల చెక్కును అందజేశారు. తర్వాత వీఎన్ పల్లెలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి. లక్ష్మీదేవి, జేసీఎస్ కో ఆర్డినేటర్ కె. నాగేంద్రారెడ్డిలు పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- మైదుకూరు నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి వ్యవసాయ శాఖ మాజీ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.
- బద్వేలు నియోజకవర్గం పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, యువ నాయకుడు దేవసాని ఆదిత్యరెడ్డి తదితరులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ జ్ఞాపకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు.

లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా

కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్ : ఎలాంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ చార్జీల వసూలుతో వినియోగదారులకు ఆయా డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. టన్ను ఇసుక ధరను ఒక్కో రీచ్ పరిధిలోని స్టాక్ పాయింట్‌కు ఒక్కో ధరను ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిర్ణయించిన ధరకు రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇసుక కావాల్సిన వారు ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ట్రాన్సిస్ట్ ఫారంలో వివరాలతో తమ ఆధార్ నంబరు నమోదు చేసి బుక్ చేసుకోవాలని సూచించారు. రుసుమును చలానా ద్వారా చెల్లించడానికి జిల్లా కలెక్టర్, జిల్లా గనులశాఖ అధికారి పేరిట సంయుక్తంగా తెరిచిన స్టేట్ బ్యాంకు ఖాతా నంబరు 43131042192, ఐఎఫ్ఎస్‌సీ ఎస్‌బీఐఎన్ 0011122 (కలెక్టరేట్ ట్రెజరీ బ్రాంచ్)కు చెల్లించవచ్చన్నారు. అలాగే బీహెచ్ఐఎం, యూపీఐ ఐడీ, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా రుసుమును చెల్లించవచ్చని తెలిపారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్ యార్డులలో సిద్ధంగా ఉన్న ఇసుకను కొండాపురం మండలంలోని కె.వెంకటాపురం, పి.అనంతపురం నుంచి టన్నుకు రూ. 340, కమలాపురంలో టన్నుకు రూ. 341, సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామంలో టన్నుకు రూ. 340, బద్వేలులో టన్నుకు రూ. 468, పోరుమామిళ్లలో టన్నుకు రూ. 587, పెండ్లిమర్రి మండలం పడగాలపల్లె, కొత్తూరులలో టన్నుకు రూ. 340, వీఎన్ పల్లె మండలంలోని ఎర్రబల్లెలో టన్నుకు రూ. 340, పులివెందులలో టన్నుకు రూ. 468, మైదుకూరులో టన్నుకు రూ. 400 చొప్పున వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

క్లుప్తంగా

ప్రమాదాలు నివారించండి

కడప అర్బన్ : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పెద్ద దర్గా నుంచి అమీర్ థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.ఇబ్రహీం, ఎస్ఐలు సంజీవరాయుడు, కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేటలో నివాసముంటున్న లక్ష్మీదేవిని ఆమె భర్త వెంకటసుబ్బారెడ్డి రోకలిబండతో బాది హత్య చేశాడు. సీకే.దిన్నె ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. వెంకటసుబ్బారెడ్డికి తన భార్య లక్ష్మీదేవితో తరచూ గొడవ ఎడేవాడు. సోమవారం యథాప్రకారం ఇద్దరూ కుటుంబ కలహాలతో గొడవపడగా.. సుబ్బారెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. అక్కడే ఉన్న రోకలి బండతో భార్య తలపై బాదాడు. తీవ్ర గాయాలైన లక్ష్మీదేవిని బంధువులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ పి.భాస్కర్, అతడి సోదరుడు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.విజయకుమార్‌లను సస్పెండ్ చేస్తూ కర్నూలు డీఐజీ సీహెచ్.విజయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువురూ కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడి సంఘటనలో నిందితులుగా ఉన్నారు. రెండు రోజుల కిందట కోర్టులో లొంగిపోయారు. వీరి వ్యవహారంపై నివేదిక అందడంతో పోలీసు ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. విజయకుమార్ గత నెలలో అధికారిపై దుర్భాషలాడటంతో ఈ చర్యలకు సిఫారసు చేశారు.

వరుస చోరీలతో ఆందోళన

ముద్దనూరు : గత కొద్ది రోజుల నుంచి మండల కేంద్రంలో దుకాణాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఆదివారం రాత్రి పులివెందుల రహదారిలోని సిమెంటు దుకాణం తాళాలు పగలగొట్టి క్యాష్ బాక్స్‌లో వున్న రూ.14 వేల నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన అంతా దుకాణంలోని సీసీ కెమరాలో రికార్డు కావడం గమనార్హం. కడప రహదారిలోని ఓ పెయింట్స్ దుకాణంలో రూ.4 వేలు చోరీ చేశారు. స్థానిక పాత పోస్టాఫీసు ఎదురుగా కూల్ డ్రింక్ షాపు తాళం పగలగొట్టి చోరీయత్నం చేసి ఏమీ దొరకక సీసాలు ధ్వంసం చేశారు. చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. గ

ఉత్తమ డ్రైవర్లుగా స్థిరపడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు భవిష్యత్తులో ఉత్తమ డ్రైవర్లుగా స్థిరపడాలని ఆర్టీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. డ్రైవర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కడపలో ఇప్పటి వరకు 273 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి వారు జీవితంలో స్థిరపడేలా చేయూతనివ్వడం జరిగిందన్నారు. అనంతరం డ్రైవర్లకు ఈడీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు, శిక్షకుడు జబ్బార్‌తోపాటు శిక్షణా డ్రైవర్లు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

జమ్మలమడుగు : ఈనె ల 10వతేదీ బుధవారం జమ్మలమడుగు ఐటీఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ నవరూప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులతోపాటు ఉత్తీర్ణత సాధించిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నియామకమెప్పుడో..?

వైవీయూ: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వ విద్యాలయాల వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లను తిరిగి నియమించేది ఎప్పుడని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వ విద్యాలయాల కోకన్వీనర్ ఎం.ఆర్.నాయక్ ప్రశ్నించారు. వైవీయూలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య నిర్వీర్యం అవుతోందన్నారు. ఎప్పుడు పీజీ అడ్మిషన్లు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్, విజయ్, శివ, మనోజ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

కమలాపురం : మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇప్పటికే కమలాపురం పట్టణంలోని కుళాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, అప్పాయపల్లెతో పాటు మండలంలోని పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, విభరాపురం, కోగటం, పందిళ్లపల్లె తదితర గ్రామాల్లో పీర్ల చావిళ్లు ముస్తాబయ్యాయి. భక్తి శ్రద్ధలతో పీర్లను ప్రతిష్టించారు. ముస్లిం సోదరులు జరుపుకొనే పండగల్లో రంజాన్, బక్రీద్ తర్వాత అత్యంత పవిత్రమైన పండుగ మొహర్రం. దక్షిణ భారత దేశంలో అన్ని మతాల వారు కలిసి జరుపుకొనే పండగల్లో మొహర్రం పండుగ ఒకటిగా ప్రజలు భావిస్తారు.

ముస్లిం సోదరులతోపాటు హిందువులు కూడా పండగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇస్లాం క్యాలెండర్ (హిజ్రి) ప్రకారం మొహర్రం నెల మొదటిది.

కుళాయి స్వామి దర్గాలో పీర్ల ప్రతిష్ఠ

కమలాపురం పట్టణంలో వెలసిన కుళ్లాయిస్వామి దర్గాలో మంగళవారం భక్తి శ్రద్ధలతో పీర్లు ప్రతిష్టించనున్నారు. మొహర్రం పండగ సందర్భంగా భక్తుల సహకారంతో దర్గా నిర్వాహకులు ఇక్కడ ఏటా పీర్లు ఘనంగా ప్రతిష్టిస్తారు. 1958 మే, 18వ తేదీ నుంచి అహోరాత్ర దీపారాధన జరగడం దర్గా ప్రత్యేకత. 17వతేదీ రాత్రి పీర్ల మెరవని జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు జెండా ఊరేగింపు, భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహిస్తామన్నారు. 18న తెల్లవారు జామున పీర్లు ఎత్తుకొని అగ్ని గుండ ప్రవేశం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.



కుళాయిస్వామి దర్గాలో ప్రతిష్టించిన పీర్లు



కమలాపురంలో వెలసిన కుళాయిస్వామి దర్గా

అనుమతులు లేని ఎరువులు అమ్మితే చర్యలు

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఎవరైనా అనుమతులు లేని ఎరువులు విక్రయించినా, ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లతో నాణ్యమైన ఎరువులు అమ్మినా చర్యలు ఉంటాయని కడప విజిలెన్స్ సీఐ ఈదురుబాషా, భూసార పరీక్షల ఏడీ కేఎంఈ.ప్రసాద్ అన్నారు. జిల్లాలోనిపలు ఎరువులు, విత్తనాలు మరియు పురుగుమందులు దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. కడపలో ఏవో సురేష్‌కుమార్‌రెడ్డి, జేడీఏ కార్యాలయ ఏవో గోవర్ధన్‌తో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మిక్సర్ యూనిట్ బ్లూ ఫాస్ఫేట్ కంపెనీ, మహేశ్వరీ ఫర్టిలైజర్స్, వివిధ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టాకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ పుస్తకాలను రోజూ నవీకరించాలని ఆదేశించారు. అనుమతి లేని స్టాకులు, వాటి ఉత్పత్తులను అమ్మరాదని తెలిపారు. ఏదైనా అవకతవకలు జరిగితే లైసెన్సు రద్దుకు సిఫారస్సు చేస్తామన్నారు. అనుమతులు ఉన్న బయో ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని సూచించారు. పలు దుకాణాల్లో ఎరువు నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాలని కడప ఎంఈఓ సురేష్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన ఉత్పత్తులనే విక్రయించాలన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మహాలక్ష్మి ఫర్టిలైజర్, భారత్ సీడ్స్ దుకాణంలో ఐదు విత్తన, ఎరువుల నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపనున్నట్లు ఎస్‌టీయల్ తిరుపతి సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎంఈ.ప్రసాద్ తెలిపారు. రికార్డులు సరిగా లేని రూ.117855 విలువ చేసే మందుల అమ్మకాలను నిలిపివేశారు. తిరుమల సీడ్స్ దుకాణంలో రికార్డులు సరిగా లేని రూ.17,440 విలువైన మందుల విక్రయాలు ఆపేశారు. అధిక ధరలకు విక్రయించినా, అనుమతిలేని ఎరువులను అమ్మినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా ఉంచుకొని ఎరువులు కొన్న ప్రతి రైతుకు బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఈదురుబాషా, జేడీ కార్యాలయం ఏఓ గోవర్ధన్, సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులోని ఓ ట్రాన్స్‌పోర్టులో బిల్లులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసులకు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్'హాల్‌లో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాధితులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడిన బాధితుల ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ www.cybercrime.gov.in ద్వారా గానీ, 1930కు ఫిర్యాదు చేసిగానీ తెలుపవచ్చునన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ : వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను సోమవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. జిల్లాలోని పరిస్థితులపై ఎస్పీని, జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

- టీడీపీ బాధితుడు కుంచంకు లక్ష రూపాయల సాయం
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గత నెల 9వ తేదీన మండలంలోని అప్పారావుపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచం శ్రీనివాసులరెడ్డి ఇంటిని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. రవీంద్రనాథ్‌రెడ్డి అదే రోజున ఇంటిని సందర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన రూ.50 వేల చెక్కు, తన సొంత డబ్బు మరో రూ.50 వేలు కలిపి సోమవారం బాధితుడికి రవీంద్రనాథ్‌రెడ్డి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్టానం, తాము అండగా ఉంటామనడానికి నిదర్శనమే ఈ సాయం అన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, జగనన్న తిరిగి సీఎం కావడం తథ్యం అన్నారు. టీడీపీ బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని, ఏం జరిగినా తక్షణమే తనకు తెలియజేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నాయకులు, తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేసి, ఇళ్లు ధ్వంసం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కుంచం శ్రీనివాసులురెడ్డికి చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

బార్‌లో ఉద్యోగిపై కత్తితో దాడి

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న చింతకొమ్మదిన్నెకు చెందిన గోవర్ధన్‌రెడ్డి(28)పై, కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన కాలియా సోమవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. రోజులాగానే కాలియా మద్యం తాగి ఘర్షణ పడుతుండగా, గోవర్ధన్‌రెడ్డి అడ్డుకున్నాడు. తనతోపాటు తెచ్చుకున్న కత్తితో కాలియా దాడి చేశాడు. దీంతో చేతికి, వేళ్లకు గాయాలైన గోవర్ధన్‌రెడ్డిని కడప తాలూకా సీఐ తిమ్మయ్య రిమ్స్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ వెల్లడించారు.

నాణ్యతలో నమ్మకమైనది భారతి సిమెంట్

ప్రొద్దుటూరు : నాణ్యతలో నమ్మకమైనదిగా భారతి సిమెంట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఎంసీ.మల్లారెడ్డి తెలిపారు. స్థానిక రాయల్ కొంటీలో సోమవారం జరిగిన జిల్లా డీలర్ల వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొందన్నారు. ఇంజినీర్ లూయిస్ వికాట్ 1817లో సిమెంట్ తయారీని కనుగొన్నారన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే దేశ వ్యాప్తంగా 16 సిమెంట్ పరిశ్రమలు, 267 రెడీమిక్స్, 72 కంకర యూనిట్లు నెలకొల్పారన్నారు. ఏడాదికి 50లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ సాధిస్తోందన్నారు. సిమెంట్ తయారీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబొరేటరీ లాంటి అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో సిమెంట్ ఉత్పత్తి చేపడుతున్నామన్నారు. కల్తీకి అవకాశం లేకుండా సంచులను ట్యాంపర్ ప్రూఫ్ చేస్తున్నామన్నారు. తాపీ మేస్త్రీలకు సంస్థ పర్సనల్ ఆక్సిడెంట్ పాలసీ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) టి.కొండల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ డి.ప్రసాద్‌రెడ్డి, డీజీఎం(టెక్నికల్ సర్వీసెస్) సీ.ఓబుళ రెడ్డితో పాటు మార్కెటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న భారతి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఇతర అధికారులు

ఉత్సాహంగా రంగస్థల పద్య పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేప మండపంలో పట్టణానికి చెందిన వెంకటసాయి వెలుగు కళాకారుల సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రంగస్థల పద్యపోటీలు ఉత్సాహంగా సాగాయి. నిర్వాహకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి పద్య పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నాటి కళలు, సంస్కృతిని నేటి తరానికి తెలియ చేయాలని ఈ పోటీలు జరిపామన్నారు. చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 57 మంది పద్యకళాకారులు పోటీలో పాల్గొనగా ప్రథమ బహుమతిగా రూ.3000ను కడపకు చెందిన కేవీరావు, ద్వితీయ బహుమతి రూ.2000 మైదుకూరుకు చెందిన ఓబులేసు, తృతీయ బహుమతి రూ.1000 ప్రొద్దుటూరుకు చెందిన పిసి.గంగయ్య గెలుచుకున్నారు. మరో 17 మంది కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర బాలాజీ, సూర్యనారాయయణరెడ్డి, నారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎర్రచందనం మొక్కల పరిశీలన

వైవీయూ : ప్రభుత్వ సహకారంతో యోగి వేమన విశ్వ విద్యాలయం వృక్ష శాస్త్ర ఆచార్యులు ఎ.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పెంచుతున్న ఎర్రచందనం మొక్కలను నేషనల్ బయో డైవర్సిటీ బోర్డు ప్రతినిధుల బృందం సోమవారం పరిశీలించింది. ఆ బోర్డు ప్రిన్సిపల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ డాక్టర్ బాలాజీ శ్రీనివాస్ గోపాలన్, ధార్వాడ అగ్రికల్చర్ సైన్స్ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ ఆర్ఆర్.అంచనాల్, ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ మెంబర్ సెక్రటరీ కష్ణమూర్తి కలిసి ఎర్రచందనం మొక్కల సంరక్షణ, పెరుగుదలను పరిశీలించారు. పిన్సిపల్ ఆచార్య షావలీఖాన్, తదితరులు ప్రతినిధుల బృందం సభ్యులను సత్కరించారు.



ఎర్రచందనం మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

వైద్య పరిశోధనలే లక్ష్యం

చెన్నూరు : ఆరోగ్య విద్యతో పాటు సామాజిక వైద్య పరిశోధన లక్ష్యంగా చేసుకుని వైద్య విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి సాధించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ అన్నారు. చెన్నూరు వనంవీధిలో సోమవారం 'ఫ్యామిలీ అడాప్షన్ కార్యక్రమాన్ని 'ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు నిర్దేశించిన ఐదు గృహాలలో సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నారు, ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. బిపి, షుగర్, బరువు, ఎత్తు, రక్తహీనత అదే విధంగా ఇతర ఆరోగ్య సమస్యలపై సర్వే నిర్వహించాలన్నారు. 11 రోజులలో విద్యార్థులందరూ కలిసి ఆరోగ్య వివరాలు సేకరించి నివేదిక రూపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ గోపీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దివ్యశ్రీ, డాక్టర్ విజయ్ కుమార్, మెడికల్ అధికారి డాక్టర్ చందన, మెడికల్ అధికారి డాక్టర్ బి చెన్నారెడ్డి, డాక్టర్ సతీష్, చెన్నూరు పీజీ, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.



కుటుంబ ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్న వైద్య విద్యార్థులు

ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలి

కమలాపురం: రైతులకు వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతుల పట్ల అవగాహన కల్పించాలని జేడీఏ అయితా నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వీఏఏలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వీఏఏలు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వారికి సాగులో సలహాలు, సూచనలు, మెలకువలు అందించాలన్నారు. సాగు చేసిన పంట పొలాలను సందర్శించి ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులను ప్రోత్సహించాలన్నారు.

వరి పైరుకు ఆశించే అగ్గి తెగుళ్లు, పురుగులు ఏ విధంగా పంటకు నష్టం చేకూరుస్తాయో వివరించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నారు. రైతుల వద్ద మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపాలన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు కార్డులు ఇప్పించాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ, కేవీకే శాస్త్రవేత్త శిల్పకళ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర ఏఓ శివ శైలజ, డివిజన్ పరిధిలోని ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, సాయిజ్యోతి, రవి శంకర్‌రెడ్డి, సంతోషిని, రైతుల సేవా కేంద్రాల వీఏఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఏ నాగేశ్వర రావు

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

పులివెందుల రూరల్ : క్యూ ఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉందని విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు అన్నారు. అంబకపల్లె రోడ్డులోని డివిజన్ కార్యాలయ అధికారులతో క్యూఆర్ కోడ్ విషయంపై ఆయన చర్చించారు. విద్యుత్తు వినియోగదారులు సులభతరంగా బిల్లులు చెల్లించేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటుచేసిందన్నారు. మొబైల్ నుంచి స్కాన్ చేసి 13 అంకెల సర్వీసు నెంబరును నమోదు చేయడం ద్వారా క్రెడిట్, డెబిట్, క్యాష్, కార్డులు, యూపీఐ, గూగుల్‌పే ద్వారా చెల్లింపు చేయవచ్చన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లులు చెల్లించే విషయంపై పులివెందుల మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్తు అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.



